అంతరాత్మ

అర్ధరాత్రి దాటింది!

అందుకు సాక్ష్యంగా కొద్ది క్షణాల క్రితమే గోడగడియారం పన్నెండు గంటలు కొట్టింది!

గదంతా నిశ్శబ్దం! స్మశాన నిశ్శబ్దం!!

దూరాన్నుంచి నక్కల అరుపులు లీలగా వినిపిస్తున్నాయి.

అతను మౌనంగా లేచి గదంతా కలయ జూసాడు.

ఏర్పాట్లన్నీ సంతృప్తికరంగా వున్నందుకు లోలోపల సంతోషిస్తూ ధైర్యంగా వూపిరి పీల్చుకున్నాడు!

ఈవారం దెయ్యంకథ

ఆ గదిలో ఆమె అతను తప్ప మరో ప్రాణి లేదు. ఉండే అవకాశం కూడా లేదు. అయినా ముందు జాగ్రత్తగా ఆ సమయమే అనువైనదిగా ఎంచుకున్నాడు. పథకం ప్రకారం కార్యక్రమాన్ని గప్‌చుప్‌గా పూర్తి చేయాలని నిర్ణయించుకున్నాడు!

భార్య భయంకర మౌనిలా నిద్రిస్తోంది! సన్నని ఆమె శ్వాస స్పష్టంగా వినిపిస్తోందతనికి. ఇక ఆలస్యం చేయడం అనవసరం అనుకున్నాడు.

కిటికీలు తలుపులు సరిగ్గా వేసాడో లేదో నని మరో సారి చెక్ చేస్కున్నాడు. ఆ తర్వాత అసలు పనిలోకి దిగేడు.

ముందుగా సీలింగ్ ఫ్యాన్ రాడ్‌కి బలమైన తాడుని కట్టి సిద్ధం చేసాడు.

టక్! టక్! టక్!

గోడ గడియారం లయబద్ధంగా శబ్దం చేస్తోంది. అది అతనికిబ్బందిగా ఒకింత గుండె గుబులుగా అనిపించింది. వెంటనే గడియారం పెండ్యులాన్ని పట్టుకుని ఆపేసాడు.

ఇంకా ఏదో శబ్దం!

సర్ర్ర్...! సర్ర్ర్....!!

వెంటనే తల తిప్పి చూసేడు.

టేబుల్ మీద గ్రామ్‌ఫోన్ రికార్డుపై ముల్లు చప్పుడు!

ఆమెను తొందరగా నిద్ర పెట్టడం కోసం వేసిన ఎల్. పి. రికార్డు... అలో చనలో మర్చే పోయేడు!

గ్రామ్‌ఫోన్ రికార్డుని తీసి మళ్ళీ ఆమె మంచం దగ్గర కొస్తుండగా గోడమీద ఏదో తపతప మని శబ్దం చేయసాగింది. బల్లి – దాని నోట్లో ఏదో పురుగు గింజుకుంటోంది.

బల్లి పట్టిన పట్టు విడవలేదు. మరుక్షణం పురుగును అమాంతం మింగేసింది. ఆ దృశ్యాన్ని చూసి అతను నెమ్మదిగా నవ్వుకుంటున్నట్టు బెడ్‌లైట్ మసక వెలుతుర్లో మెరుస్తున్న అతని పళ్ళు చెబుతున్నాయి.

ఈ రాత్రితో సీత జీవితం కూడా ఆ పురుగులాగే అంతమౌతుంది. తెల్లారే సరికి తను ఇక స్వేచ్ఛాజీవి. పెళ్ళాం చావుతో తన పీడ పూర్తిగా విరగడై పోతుంది. తను కోరుకున్న జీవితాన్ని పొందే అదృష్టం రేపటినుంచే ప్రారంభం అవుతుంది అనుకున్నాడతను నెమ్మదిగా కదుల్తూ.

"ఏయ్!... ఆగు... ఏవిటి నువ్వు చేస్తున్న పని!!"

ఏదో అస్పష్టమైన గొంతు బిగ్గరగా వినిపించినట్లనిపించిందతనికి.

ఒక్క క్షణం నిశ్చేష్టుడై పోయేడు!

గుండెలు జారిపోయేయి. నరాలు భయంతో తన్నుకు పోయినట్టు భీతి చెందేడు. ఒంట్లో సన్నని వొణుకు ప్రారంభమైంది.

వెంటనే వెనక్కి తిరగ బోయేడు. కాని సాధ్యపడలేదు. గగుర్పాటుతో తనను తాను స్వాధీన పర్చుకోలేక తికమక పడిపోయేడు. అలా కొన్ని క్షణాలు నరకాన్ని చవిచూపింది ఆ గదిలోని ప్రశాంతత అతనికి.

ఎదురుగా భార్య అమాయకంగా నిద్రిస్తోంది.

ఆ మాట లెవరన్నట్టు!?

భయపడుతూనే వెనక్కి చూసేడు అతిప్రయత్నంమ్మీద.

ఎవరూ కనిపించలేదు!

అంతా తన భ్రమ అనుకుని మరో అడుగు ముందుకేయ బోయేడు.

"ఆగు....! నిన్నే!" మళ్ళీ అదేగొంతు.

ఇదీ! అని స్పష్టంగా తెలియని గొంతు.

ఆడా కాదు. మగా కాదు.

అసలు మనిషి స్వరంలా లేదు.

ఈ సారి నిజంగానే భయమేసిందతనికి.

తిరిగి చూసేడు!

మళ్ళీ అదే శూన్యం!! ఎవరూ కనిపించలేదు.

ఏవిటీ విచిత్రం! కొంప తీసి గదిలో తనకు తెలీకుండా మూడో వ్యక్తి....! 'అసంభవం' అనుకుంటూనే గదంతా కిందా మీదా జాగ్రత్తగా పరిశీలించి చూసేడు! ఎవరూ కనిపించలేదు!

అతను దీర్ఘంగా ఆలోచిస్తూ ఆశ్చర్యంలో పడిపోయేడు చాలా సేపు.

ఒకవేళ దెయ్యమేమో! ఆ ఊహ అతనికి చెప్పలేనంత భయాన్ని కలిగించింది. ఎందుకంటే అతనికి చిన్నప్పట్నుంచి దెయ్యమంటే గొప్ప భయం. ఆ పేరు వింటేనే హడలిపోతాడు

అదీగాక– ఎవరో చచ్చిపోయి దెయ్యమై తిరుగుతున్నట్టు అప్పుడప్పుడూ ఫూళ్ళో అనుకోవడం కూడా విన్నాడు.

అవును! ఆ దెయ్యమే నేమో!! ఛ ఛ! యిదేమిటి తనిలా భయపడుతున్నాడు. ఊరికే భయపడేవాడు సుఖపడలేడంటారు. ఇంత దాకా తెగించి యిప్పుడు వెనుకంజ వేస్తే ఎలా! రేపు తను సుఖపడాలంటే యీ రాత్రి తననుకున్నది పూర్తి చేయాలి. ధృడనిశ్చయంగా అనుకుని తాడుని చేత్తో పట్టుకున్నాడు. సరిగ్గా అదే సమయంలో అతన్ని వెనక్కి లాగుతూ భుజమ్మీద ఎవరిదో చెయ్యి పడింది.

తక్కున వెనక్కి తిరిగి చూసేడు జుగుప్సతో.

మసక చీకట్లో మనిషి ఆకారం నల్లగా అగుపించింది.

"ఎవరు నువ్వు?!" హఠాత్తుగా అన్నాడు.

ఆ ఆకారం నుంచి ఎటువంటి సమాధానం రాలేదు.

మరికాస్త దగ్గరకు జరిగి "నిన్నే...! ఎవరు....!" అన్నాడు కాస్త బిగ్గరగా.

ఆ అరుపుకి సీత ఇటు నుంచి అటు వొత్తిగిల్లింది.

అతను స్విచ్ నొక్కేడు లైట్ వేసే ప్రయత్నంగా.

ఆశ్చర్యం! బల్బు వెలగలేదు!!

ఆదిరెడ్డి మాపుళ్ళు

మళ్ళీ స్విచ్ నొక్కేడు. వెలగలేదు.

మళ్ళీ...! మళ్ళీ...!! మళ్ళీ...!!! చాలా సార్లు ప్రయత్నించేడు.

"బల్బు వెలగదు" నల్లని ఆకారం నెమ్మదిగా అందప్పుడు ఆదోలా నవ్వుతూ.

అతను విసురుగా ఆ ఆకారాన్ని చేత్తో పట్టుకున్నాడు. ఈ సారి మరింత ఆశ్చర్య మేసింది. ఆకారం చేతికి తగలడంలేదు. మాట మాత్రం విన్పిస్తోంది.

"నే నీ చేతికి తగలను...! వినిపిస్తానంతే!"

"అంటే! నువ్వు మనిషివి కావా!"

"కాదు దెయ్యాన్ని!"

అప్పుడు చూసాడు. ఆ ఆకారం కాళ్ళు వెనక్కి తిరిగి వున్నాయి.

ఒక్కక్షణం అతను బ్రాన్పడి పోయేడు. తనను తాను నిగ్రహించుకో లేక పోయేడు. ప్రాణాలు పోతున్నట్టు ఊపిరి సలపనట్టు... కొన్ని క్షణాలు అలాగే గడిచాయి.

ఆ తర్వాత అతనికి తెలియకుండానే ఆ దెయ్యాన్ని "ఎందుకొచ్చా విక్కడికి?!" అని ప్రశ్నించాడు.

ఆక్షణంలో అతను మరొకటి గమనించేడు.

తను మాట్లాడు తున్నప్పుడల్లా భార్య మంచమ్మీద నిద్రలోనే శబ్దానికి కదుల్తోంది. నిజానికి ఆ ఆకారం కంటే చాలా చిన్న గొంతు పెట్టి మాట్లాడుతున్నాడు. అయినా ఆ ఆకారం మాట్లాడినప్పుడు అణుమాత్రం కూడా ఆమెలో కదలిక కనిపించడం లేదు.

"నువ్వు చేస్తున్న అఘాయిత్యాన్ని ఆపడాని కొచ్చాను!" దెయ్యం చెప్పింది.

"నీకూ దీనికి ఏమిటి సంబంధం?!"

"అది నీ కనవసరం!"

"అయితే నన్నొదిలెయ్....! నా దారి కడ్డురాకు.... వెళ్ళిపో"

"అది కల్లో మాట!" దెయ్యం అంది.

"అంటే! నన్నీ పని చెయ్యనియ్యవా?!" ఉన్న కొద్దీ

అంతరాత్మ

అతనిలో ఏదో తెలియని ధైర్యం ఏర్పడుతోంది. దెయ్యంతో వాదనకు దిగాడు.

"హత్య చేయడం నేరమే కాదు పాపం కూడా!"

"కావచ్చు!"

"తెలిసి ఎందుకు చేస్తున్నావు?!"

"నా కోసం...! నా సుఖం కోసం!"

"నీకేం తక్కువ...? నీ సుఖాని కొచ్చిన లోటేమిటి? అందమైన భార్య....! అందులోనూ ప్రేమించిన భార్య...!!"

"అదే నా బాధ!"

"అంటే?!" దెయ్యం అడిగింది.

అతను కొంతసేపు మౌనం వహించేడు.

"ఆమె మీద నీకేమైన అనుమానమా?!"

"అలాంటి దేమీలేదు."

"మరి!" అడిగింది దెయ్యం

"ఆమెను ప్రేమించి పెళ్ళి చేస్కోవడం వల్ల నేను చాలా పోగొట్టుకున్నాను!"

"ఏమిటవి?!"

"స్కూటరులేదు.... చేతికి మంచి వాచీ లేదు... ఉండటానికి మంచి యిల్లు కూడా లేదు."

"ఓహో..! అదా సంగతి...! అర్థమైంది...! నీ పెళ్ళికి కట్నాలూ కానుకలూ లేవన్నమాట...! యీ బుద్ధి అప్పుడేమైంది...?! ఆమెను ప్రేమించా నన్నావు...! ఆమె నీ ప్రాణమన్నావు...! ఆమె నీదైతే చాలు...! యింకేమీ జీవితంలో కోరనన్నావు కదూ...!"

"అవును...! అన్నాను...!! అప్పుడు తెలియక ఏదో అన్నాను...! యిప్పుడన్నీ తెల్సుకున్నాను... అందరలుళ్ళూ అత్తమామల దగ్గర తమ కోర్కెల్ని తీర్చుకుంటున్నారు. నాకు మాత్రం ఆ అదృష్టం లేదు. నేనడిగినా వారిచ్చే స్థితిలో లేరు... అందుకే యీమెను వొదిలించుకుని మరో అమ్మాయిని పెళ్ళాడ్తాను...! నా సరదాలు తీర్చుకుంటాను...!"

"నీ సరదాల కోసం ఓ నిండు ప్రాణాన్ని బలిగొంటావా...! చట్టం నిన్ను శిక్షిస్తుంది!!"

"ఆ భయం నాకు లేదు... యీ హత్యను ఆత్మహత్యగా మార్చడానికి అన్ని జాగ్రత్తలూ ముందే తీసుకున్నాను...!" అతను ధైర్యంగా చెప్పాడు.

"ఎవర్నుంచి ఎలా తప్పించుకున్నా నువ్వు నా దృష్టిని మాత్రం తప్పించుకుని ఏ పనీ చేయలేవు!!"

"నువ్వా...!? నువ్వు నన్నేమీ చేయలేవు!" అతను వికటాట్టహాసం చేసాడు.

"ఏమీ చేయలేనా...! అయితే కాస్కో...." అంటూ దెయ్యం ఒక్కసారి అతనిపై పడింది. గొంతు పిసుకుతూ పది నిమిషాలు గిరున తిప్పి గోడకేసి కొట్టింది.

అంతే!

అతను గిలగిలా గింజుకుని బంతిలా ఎగిరి పడ్డాడు. మరుక్షణాన్నే అదే స్పీడుతో వచ్చి దెయ్యం కాళ్ళ దగ్గర కుప్పలా పడిపోయేడు.

అతనికి ఊపిరి సలపడం లేదు. కళ్ళు తిరుగు తున్నాయి. ప్రాణం పోయిందేమో అనిపిస్తోంది. భూమి గుండ్రంగా తిరుగుతున్నట్టుగా... భయంకరమైన అగాధంలో కూరుకు పోతు న్నట్టుగా... ప్రత్యక్ష నరకాన్ని చవి చూసా డతను చాలా సేపు.

"ఎలా వుంది నా తడాఖా...! ఇది కేవలం మచ్చుక మాత్రమే...!! ప్రాణం పోకుండా చంపుతాను. జాగ్రత్త...!!!

దెయ్యం హెచ్చరించింది.

అతను మారు మాట్లాడ లేదు. కుక్కిన పేనులా పడివున్నాడు. నిజానికి అతనింకా నరకయాతన నుంచి పూర్తిగా తేరుకోలేదు.

"ఇప్పుడే కాదు...! యిక ముందెప్పుడైనా ఆమెకు ద్రోహం తలపెట్టావో...! చూస్కో... నీ భరతం పడ్తాను...? అనుక్షణం నీ వెన్నంటి వుంటాను. నిన్నోకంట కనిపెడ్తూనే వుంటాను... నా కన్నుగప్పి చెడు తలపెడ్తే చంపేస్తాను...! తస్మాత్ జాగ్రత్త."

* * * * * * *

"సీతా! నన్ను క్షమిస్తావు కదూ...!" రఘు భార్యకేసి ఆర్తిగా చూసేడు.

సీత విస్మయంగా చూసింది. ఆమెకంతా అయోమయంగా వుంది. ఈయనకేమైంది? ఇంత లోనే యింత మార్పు ఎలా వచ్చింది? నిన్న సాయంత్రం నుంచి గమనిస్తోంది. ఆయన ప్రవర్తన... ఆయన ధోరణి... ఏదో అంతు తెలియని వింత పోకడలు ప్రస్ఫుటిస్తున్నాయి ఆయన ప్రతి కదలికలోనూ!

"చెప్పు సీతా! నన్ను క్షమించానని చెప్పు" రఘు ముఖం పీక్కుపోయి నీరసించి పోయింది... లోతుకు పోయిన కళ్ళు... వదనంలో ప్రేత కళ... రాత్రంతా నిద్రలేనట్టుగా యిట్టే చెబుతున్నాయి.

"అదేమిటండి...! అంత తప్పు మీరేం చేసారని"

"లేదు సీతా! నేను చాలా తప్పు చేసాను...



కట్టుకున్న భార్యవి... ప్రేమించి పెళ్ళి చేసుకున్న నిన్ను అన్యాయంగా హింసించేను... కట్న కానుకలు పుట్టింట్నుంచి తీసుకురమ్మని అనరాని మాట లన్నాను... అనవసరంగా నిన్ను బాధపెట్టాను. అఖరికి... నిన్ను... నిజంగా నా పాపానికి నిష్కృతి లేదు!" అంటూ రఘు భార్య కళ్ళలోకి చూస్తూ కంట తడి చేస్తున్నాడు.

"ఛ! ఛ!! ఊర్కోండి!" సీత అతన్ని ఊరడించింది.

రఘు పసివాడిలా ఏడుస్తుంటే ఆమె హృదయం తరుక్కుపోయింది. భర్త తన ఎదుటే కళ్ళ నీళ్ళ పర్యంతమై రోదిస్తుంటే ఎలా ఓదార్చాలో తెలియక తికమక పడింది సీత.

ఆ సాయంత్రం సీత తల్లిదండ్రులు ఊర్నుంచొచ్చేరు. వస్తూనే కూతుర్ని ఆవేదనతో కౌగిలించు కున్నారు. "నా తల్లీ! అప్పుడే నీ కెన్ని కష్టాలొచ్చేయే!" అంటూ...

"ఇప్పుడు నాకేమైందని...! ఆయన నన్ను బాగానే చూస్కుంటున్నారు!" సీత మామూలుగా అంది వాళ్ళతో.

"మాకు తెలుసమ్మా! అంత తొందరపడి బయటపడే మనస్తత్వం కాదు నీది...! రాక్షసుడు...! యిన్నాళ్ళూ నిన్నెంత హింసించేడో...!"

"అమ్మా... ఆయనన్నంత మాటనకు...!" సీత అన్నది తల్లితో.

"ఇంకా ఎందుకు భర్తను వెనకేసు కొస్తావు... వొట్టి మనిషివి కాదన్న ఆలోచన కూడా లేకుండా నిన్ను నరకయాతనలు పెట్టాడు... నీ కోసం వూరుకున్నాం.... లేకపోతే ఆ నీచుడ్ని కోర్టుకీడ్చి...!"

"నాన్నా...!" తండ్రి మాటలు పూర్తి కాకుండానే సీత అడ్డుపడుతూ అరిచింది. వాళ్ళెందుకలా మాట్లాడుతున్నారో ఆమెకు తెలుసు. నాలుగు రోజులు క్రితం భర్త తనను చూస్తున్న తీరును పెడుతున్న బాధల్ని అన్నీ విడమరుస్తూ తల్లి దండ్రులకి వుత్తరం రాసింది... వెంటనే వొచ్చి తనను తీస్కెళ్ళమని కబురంపింది. కాని వాళ్ళొచ్చేలోగా భర్త మారిపోతాడని ఊహించలేక పోయింది సీత.

"బాగున్నారా అండి! ఎంతసేపయిందొచ్చి!" రఘు ఆఫీసు నుంచొస్తూనే అత్త మామల్ని చూసి ఆప్యాయంగా పలకరించాడు.

వాళ్ళు అయోమయంగా ఒకరి మొహాలొకరు

దేవా(శిథిలా)లయం

నా హృదయమన్నది
ఒక పవిత్ర
నిలయం!
అందులో నీవుంటే
అది
దేవాలయం...
లేకుంటే
శిథిలాలయం!

-సలీం

అంతరాత్మ

చూస్కున్నారు. కూతురు వైపు అదోలా చూసేరు.

రఘు అవేం గమనించే స్థితిలో లేడు. రాక రాక యింటి కొచ్చిన అత్త మామల్ని ఏ రీతిని సత్కరించాలా అని ఆలోచనలో పడిపోయేడు. పెద్దల నెదిరించి ఇంటి నుంచి బయటి కొచ్చి యిద్దరూ స్వతంత్రంగా బ్రతకడం మొదలు పెట్టిన యిన్నాళ్ళకిదే వాళ్ళు రావడం. ఈ రెండేళ్ళలో తన వైపువాళ్ళుగాని సీత వైపు వాళ్ళుగాని ఎవరూ రాలేదు. కనీసం ఎలా వుంటున్నారో ఎక్కడుంటున్నారో కూడా పట్టించుకున్న దాఖలాలు కూడా లేవు. ఇరుపక్షాల వారికి ఒకరంటే ఒకరికి అంత విముఖత వుండేది వాళ్ళ ప్రేమ నంగీకరించడానికి.

రఘు సీతలది వర్ణాంతర వివాహం. రఘు అగ్రకులస్తుడు. పైగా సీత పేదింటి పిల్ల. అదీ వాళ్ళ వైష్యమ్యాలకి కారణం.

కూతురు అనవసరపు ప్రేమలోపడి గొప్పింటి బిడ్డను కోరు కుంటోందని వీళ్ళనుకుంటే– కొడుకు నిమ్న జాతుల్తో కలిసి కులప్రతిష్టకు భంగం కల్గిస్తున్నాడని వాళ్ళనుకున్నారు. ఇలాంటి వాతావరణంలో తెగించి పెళ్ళి చేస్కున్నారు రఘు సీత.

"సీతా! నేనిప్పుడే బజారు కెళ్ళి కావలసినవి కొనుక్కు వస్తాను... యీలోగా వాళ్ళక్కావలసినవి చూడు!" అంటూ రఘు హడావుడిగా మళ్ళీ బయటి కెళ్ళి పోయేడు.

మర్నాడు ఆఫీసుకి శెలవు పెట్టి ఊరంతా తిప్పాడు వాళ్ళని. చూడవలసిన ప్రాంతాలన్నీ దగ్గరుండి మరీ చూపించేడు. ఆ రెండ్రోజులూ ఓ నెల జీతం దాకా ఖర్చయింది.

అల్లుడు చేస్తున్న అర్భాటాలకి వాళ్ళు తబ్బిబ్బై పోయేరు అలాంటి అల్లుడ్ని అనరాని మాట లన్నందుకు లోలోపల బాధపడి పోయేరు. అందుకే వెళ్ళిపోయే ముందు–

"బాబూ! నువ్వెంత మా అమ్మాయిని ప్రేమించి పెళ్ళి చేస్కున్నా అల్లుడిగా నీ కోర్కెలు తీర్చాల్సిన బాధ్యత మాకుంది. అది మా విధి. ఇది గ్రహించడానికి మా కిన్నాళ్ళు పట్టింది!" అంటూ ఉన్న కొద్దిపాటి భూమి ఇల్లు అమ్మి తెచ్చిన డబ్బు అల్లుడు చేతిలో పెట్టబోయేరు.

రఘు ససేమిరా కాదన్నాడు. ఎంత బ్రతిమాలినా ఆ డబ్బు తీస్కోవడానికి అంగీకరించ లేదతడు.

ఈసారి నిజంగా తెల్లబోయింది సీత. నిన్న మొన్నటిదాకా స్కూటరూ అవీ యివీ కావాలని తననేడిపించిన భర్త యిలా ఎందుకు మారిపోయాడో అర్థం కాలేదామెకు. ఏమైతేనేం అతను మారిపోయేడు.

ఏ దేవుడు పూనాడో... తన సంసారం యిక ఏ ఒడిదుడుకు లేకుండా సాగిపోతుందని మనసులోనే మురిసిపోతూ దేవుడ్ని ప్రార్థించుకుంది సీత.

కాని భర్తకు పూనింది దేవుడు కాదని దెయ్యమని ఆమెకేం తెల్సు!

అయితే యింతకీ ఆ దెయ్యం ఎవరు?

ఎవరో కాదు! అతని అంతరాత్మ.

ప్రతి మనిషికి ఓ అంతరాత్మ వుంటుంది. అది మనిషి అంతరాంతరాల్లో దాగి వుంటూ మనిషి బాహ్య ప్రవృత్తుల్ని భేరీజు వేస్తూ పరిశీలిస్తుంది. అవసరమైనప్పుడు తప్ప ఎప్పుడూ బయల్పడదు. మనిషి మంచి చేసేటప్పుడు ప్రోత్సహిస్తుంది. వంచనతో ప్రవర్తించి చెడును తలపెట్టినప్పుడు నీడలా వెంటాడుతూ భయపెట్టి దెయ్యమై పట్టి పీడిస్తుంది. ఎంతటి క్రూరుల్నైనా భయకంపితుల్ని చేసి ప్రతిఘటిస్తుంది.

అందుకే అంతరాత్మను తప్పించుకుని మనిషి ఎప్పుడూ ఏ పని చేయలేడు. అదే అతని బలహీనత.

o

నెరిసిన జుట్టు నల్లని మార్పు
కృత్రిమంగా కాక మా అయుర్వేదిక మానెతో వయస్సుకు ముందే నెరిసిన జుట్టు పండ కుండా వుండి నల్లగా మారుతుంది. ఈ మానెతో మీ జుట్టు నల్లగా మారి దళసరి మెరుపులతో వుంటుంది, మస్తిష్కం చల్లగానుండి కళ్ళ దృష్టి చక్కగా వుంటుది.
ధర : ఒక పూర్తి కోర్స్ రూ. 80/-
పోస్ట్ చార్జీలు అధికం.
GAUTAM CHIKITSALAY(A.O)
P.O. KATRI SARAI (GAYA)

విజయ షోరూమ్
జె.డి.హాస్పటల్ రోడ్, గవర్నరు పేట,
విజయవాడ-2, ఫోన్: 77142.
వివాహాది శుభకార్యములకు వలయు అన్నిరకముల ఫ్యాన్సీ వస్త్రములకు వెంకటగిరి వగైరా అసలు వెండిజరీ చీరెలకు దయచేయండి.

పిల్లల సచిత్ర మాసపత్రిక
బాలరంజని
చదవండి!
ఆంధ్రపత్రిక ప్రచురణ!!